క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన మొయిళ్ల గౌరి, ఆమె భర్త సురేష్‌రెడ్డిలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్కను అందజేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సునీల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనారోగ్యంతో నెల్లూరు మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 45వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపులేటి సునీల్‌ను పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు.

వెంకటరెడ్డితో విజయకుమార్‌రెడ్డి భేటీ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎల్ఐసీ కార్యాలయానికి సమీపంలో ఉన్న మేకపాటి గెస్ట్ హౌస్‌లో సోమవారం భేటీ అయి పలు అంశాలపై చర్చించారు.

క్షయరహిత సమాజానికి కృషి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): క్షయరహిత సమాజం కోసం వైద్యసిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సూచించారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక చాకలివీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆల్కహాల్ తాగేవారు, పొగాకు ఉత్పత్తులు వాడేవారు క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే క్షయ నివారణకు టీకాలు వేయించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయవ్యాధికి చికిత్సతో పాటు మంచి మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, డాక్టర్ గీతాంజలి, సీఓ తిరుపతయ్య, టీబీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ విజయకుమార్, శ్రావణ్‌కుమార్, హరీష్, మధు, రాజేంద్ర, షాకీరా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభినందన



నెల్లూరు(బృందావనం): గోవాలో జరిగిన 'మిస్ టీన్ సూపర్ గ్లోబ్ క్వీన్ ఇండియా' పోటీల్లో విన్నర్‌గా నిలిచిన నెల్లూరు యువతి సాదికా అన్సారి సయ్యద్‌కు ఆదివారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసిన్, కార్పొరేటర్ కరీముల్లా, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్ పాల్గొని, ఆమెను అభినందించారు.

ఎస్పీబీ జయంతి వేడుకలు రేపు

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలో పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై.శేషగిరీశం సోమవారం తెలిపారు. బాలు కుటుంబ సభ్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారన్నారు.

దుర్మార్గపు పాలనకు గుణపాఠం తప్పదు

- వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు గుణపాఠం తప్పదని, ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు, రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి హెచ్చరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధంగా అక్రమ కేసులు పెడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీ జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను తెలిపేందుకు ఏర్పాటు చేసిన వెన్నుపోటు దినానికి ప్రజలంతా తరలిరావాలని కోరారు.

ప్రజలు భారీగా తరలిరావాలి

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. కూటమి నేతలు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల విషయంలో, డైవర్షన్ పాలిటిక్స్‌లో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అరాచక పాలనలో భాగంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసును బనాయించి జైలుకు పంపారని మండిపడ్డారు. హామీల విషయంలో టీడీపీ నాయకులు రోడ్లపైకి వస్తే ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకాణి కుటుంబాన్ని పరామర్శించిన జంకె వెంకటరెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సోమవారం పరామర్శించారు. నగరంలోని డైకస్ రోడ్డు నివాసంలో కాకాణి పూజితతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు



కాకాణి పూజితతో మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు



'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న జరిగే వెన్నుపోటు దినాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమ పోస్టర్‌ను వారు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. హామీలను అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి వెన్నుపోటు దినం కార్యక్రమం ద్వారా ప్రజాగ్రహాన్ని తెలియజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి



క్లాత్ బ్యాగులను ఆవిష్కరించిన ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు

నెల్లూరు రూరల్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు సూచించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్లాస్టిక్ అనర్థాలపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం అర్జీదారులకు అవగాహన కల్పించారు. జిల్లాస్థాయి అధికారులు తమ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెలా నిర్వహించే జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్లాస్టిక్ నిర్మూలనను అజెండాగా చేర్చి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 4న అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5న నగరంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి గ్రీన్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాకారులతో..

పర్యావరణానికి, ప్రాణకోటికి ఇబ్బంది కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలంతా నిషేధించాలంటూ కలెక్టరేట్ వద్ద కళాకారులు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులు, అధికారులకు తమ ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండాలని సూచించారు.

ఆశ్రమ భవనం ప్రైవేటుపరం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



భరద్వాజ ఆశ్రమ భవనం ఎదురుగా మాట్లాడుతున్న దాతలు, భక్తులు, పర్యవేక్షకులు

నెల్లూరు(బృందావనం): దాదాపు 30 ఏళ్లుగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఉన్న ఆశ్రమాన్ని ప్రైవేటుపరం చేయడం తగదని భక్తులు, నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్.రాజగోపాల్‌రెడ్డి, వి.గంగిరెడ్డి, బి.బాలాజీ, జి.రమణయ్య, ఎస్.గిరిజ, బుజ్జమ్మ, చంద్రకళ, పి.జయలక్ష్మి, ఎ.సునీత, కె.లక్ష్మి తదితరులు సోమవారం ఆశ్రమం వద్ద విలేకరులతో మాట్లాడారు. నగరంలోని సత్యనారాయణపురంలో 57 సెంట్ల పరిధిలో 1987లో తిరుపతి జిల్లా ఏర్పేడుకు చెందిన గంగాధరనందస్వామి శ్రీభరద్వాజ ఆశ్రమాన్ని స్థాపించారని, భక్తుల సహకారంతో 1993లో ఉమామహేశ్వరాలయం, శ్రీకృష్ణమందిరం నిర్మాణాలతో పాటు ఆశ్రమాన్ని అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి 30 ఏళ్లుగా ఏటా పండగల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నట్లు వెల్లడించారు. కాగా ప్రస్తుతం ఈ ఆశ్రమానికి ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణగీతాశ్రమం ఈఓ కె.రామచంద్రాచార్యులు పర్యవేక్షిస్తున్నారని, ఆయన గత నెల 7న నెల్లూరుకు వచ్చి శ్రీహర్ష ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిర్వాహకుడు అజిత్‌బాబుకు ఆశ్రమాన్ని లీజుకు ఇచ్చారన్నారు. స్థానికులు, భక్తులు, దాతలకు తెలియజేయకుండా దేవదాయ నిబంధనలు పట్టించుకోకుండా అగ్రిమెంట్ చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

- కమిషనర్ నందన్



శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని కమిషనర్ నందన్ సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ, ట్రంకు రోడ్డు, సిరి థియేటర్ లైన్, రంగనాయకులపేట ఘాట్, శెట్టిగుంటరోడ్డు, కుక్కలగుంట వెహికల్ షెడ్, పరమేశ్వరి నగర్ వాకర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. డ్రెయిన్ కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారి, దోమల ఉత్పత్తికి కారణం అవుతుందని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించడం చట్టరీత్యా నేరమని, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు జరిగేలా అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతా, శిశు మరణాలు జరగకుండా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుజాత సూచించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో మాతా, శిశు మరణాల సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో జరిగిన రెండు మాతృ మరణాలు, ఆరు శిశు మరణాలకు కారణాలు, లోపాల గురించి సమీక్షించారు. మాతృ మరణాలు జరగకుండా ఉండాలంటే గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. నెలవారీగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణులకు పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత లేకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ లాంటి మందులు, ఇంజెక్షన్లు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. బీపీ, షుగర్, ఊబకాయం వంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆస్పత్రుల్లో సుఖప్రసవం జరిగే వరకు నర్సింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే జీరో డోసు కింద టీకాలు ఇవ్వాలన్నారు. ముర్రిపాలు పట్టించాలన్నారు. సకాలంలో వైద్యసేవలందక మరణాలు సంభవిస్తే ఆ ప్రాంతంలోని ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీహెచ్ఎస్ పరిమళ, డీఎల్‌టీఓ ఖాదర్ వలీ, గైనికాలజీ ప్రొఫెసర్ ఇందిర, అసోసియేట్ ప్రొఫెసర్లు మేరి, స్నిగ్ధ, శోభారాణి, విజయలక్ష్మి, సింధూజ, హేమంత్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాక్‌వాసవి, విజయకుమారి, డీఐఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): దేశంలో కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికవర్ ఆస్పత్రి పీడియాట్రిషియన్ ఉదయకీర్తి సూచించారు. ఈ మేరకు ఆమె నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పెద్దలతో పోలిస్తే చిన్నపిల్లల్లో కోవిడ్ వైరస్ తేలికపాటి లక్షణాలతో కనిపిస్తుందన్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు లాంటి సాధారణ లక్షణాలు మాత్రమే ఉంటాయన్నారు. పిల్లలకు కోవిడ్ నిర్ధారణ అయితే తగిన ద్రవ పదార్థాలను ఆహారంగా ఇస్తూ ఇంట్లోనే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. శ్వాస సమస్యలుంటే ఆస్పత్రిలో అడ్మిట్ అవ్వాలన్నారు. ఇంట్లోకి బాగా గాలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

4, 5 తేదీల్లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

నెల్లూరు రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి అకౌంటెంట్ జనరల్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆరోజు కార్యక్రమం జరుగుతుందన్నారు. 5వ తేదీన వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో అదాలత్ నిర్వహిస్తామన్నారు. అధికారులు వారి శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, ఇతర వివరాలతో హాజరుకావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎస్ కేసులను సమీక్షించి అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. జిల్లాలోని పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి నోడల్ అధికారిగా హాజరవుతారని వెల్లడించారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం వద్దు

నెల్లూరు(బారకాసు): నగర పరిధిలో తాగునీటి కుళాయి పన్నులను ప్రతిరోజు విధిగా వసూలు చేయాలని, ఇందులో అలసత్వం తగదని అధికారులు, సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ నందన్ సూచించారు. వారాంతపు సమీక్షలో భాగంగా ఇంజినీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాధికారులతో కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధుల్లో చురుగ్గా పాల్గొనాలని, అనధికార కుళాయిలను పన్ను పరిధిలోకి తీసుకురావాలని, వాటికి సంబంధించిన చలానాలను సచివాలయాల్లోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్ షెల్టర్లను క్రమం తప్పకుండా గమనిస్తూ, దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రజలు ఇస్తున్న అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్‌ను పాల్గొని, అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మంజూరు చేసిన గృహాలను అర్హులైన ఇతరులకు మంజూరు చేయనున్నామన్నారు. అదేవిధంగా అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్ట్‌గేజ్ విడుదల గురించి ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రోడ్లు, డ్రెయిన్ కాలువల నిర్మాణం, సివిల్ వర్క్‌లు, వీధిదీపాల ఏర్పాటు, రెవెన్యూ విభాగం నుంచి అసెస్‌మెంట్ మార్పులు, నూతన ఇంటి పన్నుల దరఖాస్తులు, ఇంటి పన్నుల మార్పులు తదితర అంశాలపై అర్జీలు అందుకున్నామన్నారు. వర్షాకాలానికి సంబంధించి అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షపు నీరు కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మొత్తం 52 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో విభాగాల వారీగా ఇంజినీరింగ్–5, హౌసింగ్–28, టౌన్ ప్లానింగ్–5, రెవెన్యూ–6, పబ్లిక్ హెల్త్–3, ఆప్కాస్–2, అకౌంటెంట్–3 చొప్పున ఫిర్యాదులు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీప్లానర్ హిమబిందు, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, మేనేజర్ రాజేశ్వరి, సెక్రటరీ శ్రీలక్ష్మితో పాటు పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపింగ్ మెషీన్లతో రహదారులు శుభ్రం



గాంధీబొమ్మ సెంటర్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రధాన రహదారులను స్వీపింగ్ మెషీన్లతో శుభ్రం చేయాలని నగరపాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చైతన్య శానిటేషన్ సిబ్బందికి సూచించారు. చింతారెడ్డిపాళెం సచివాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని రహదారులు స్వీపింగ్ మెషీన్లతో శుభ్రం చేస్తుండగా మిగిలిన ప్రతిరోడ్డును కూడా క్లీన్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన గార్బేజ్ పాయింట్స్ లేకుండా చూడాలన్నారు. అనంతరం ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, సండే మార్కెట్ వద్ద జరుగుతున్న చిన్న కాలువల పూడికతీత పనులను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

నారాయణ హవా



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

నెల్లూరు (టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయిలో హవా ప్రదర్శించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గోమతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధుకిరణ్ 113, పూర్వజ్ 332, సంతోష్ 1,361, భానురిషిక్ 1,563, అఖిలేష్ 2,323, యశ్వంత్‌బాబి 2,481, సాయిసాత్విక్ 2,517, ఆశ్రిత 2,758, హర్షవర్ధన్‌రెడ్డి 2,760, శశిజ్ఞానకౌశిక్‌రెడ్డి 3,129, హితేష్ అభిషేక్ 3,292, భానుసుజిత్ 3,446, మేఘన 3,756 ర్యాంకులు సాధించారన్నారు. ఓపెన్ కేటగిరీలో 150లోపు ఒకరు, రెండు వేలలోపు నలుగురు, మూడు వేల లోపు తొమ్మిది మంది, ఐదు వేలలోపు 14 మంది, పది వేలలోపు 25 మంది, 20 వేలలోపు 56 మంది ర్యాంకులు సాధించారన్నారు. మొత్తం 130 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు.

రత్నం ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారని కిశోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. స్థానిక రత్నం జూనియర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో పి.సాయివర్షిల్‌రెడ్డి జనరల్ కేటగిరీలో ఐఐటీ సీటు, ఎస్.తిలక్ వర్మ, జె.ప్రశాంత్, కె.నిహారిక, వై.తినేష్, పి.మహీధర్, ఎం.త్రిషాంత్, ఎం.తేజోను, ఎ.యోగేష్‌లు ఎన్ఐటీలో సీట్లు సాధిస్తారన్నారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డైరెక్టర్లు కృష్ణకిషోర్‌రెడ్డి, వాసంతికిశోర్ అభినందనలు తెలిపారన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ నరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసాయి విజయకేతనం



సాయిరూపేష్



కైలాష్‌రెడ్డి



కుష్వంత్ కుమార్

నెల్లూరు (టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్.సాయిరూపేష్ 2,298వ ర్యాంకు, జి.కైలాష్‌రెడ్డి 3,391, యు.కుష్వంత్‌కుమార్ 10,708 ర్యాంకులు సాధించారన్నారు. స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్, 5 స్టెప్‌ల ప్రోగ్రామ్ ద్వారా ఇలాంటి ఫలితాలు సాధించినట్లు చెప్పారు.